క్లుప్తంగా

జెడ్ వీరారెడ్డి సేవలు చిరస్మరణీయం



జెడ్.వీరారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: రైతు సంఘం మాజీ అధ్యక్షుడు జెడ్ వీరారెడ్డి ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. జెడ్ వీరారెడ్డి 19వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన సమాధి వద్ద బుధవారం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతు సంఘం సహాయ కార్యదర్శి దస్తగిరి మాట్లాడుతూ జిల్లాలో రైతు సంఘం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. రైతుల సమస్యల పరిష్కరించడం కోసం ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేశారు. నాయకులు జెడ్ రాజశేఖర్‌రెడ్డి, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిద్దాం



మాట్లాడుతున్న ఏఓ ఆంజనేయులు

పెద్దపప్పూరు: గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిద్దామని ఎంపీపీ వెంకటరామి రెడ్డి (రామయ్య) అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అర్హత ఉన్నా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి అందేలా కృషిచేయాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి సమస్య ఉన్నా ప్రజాప్రతినిధులు వాటిని అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. రైతులు ఆర్బీకేల సేవలను వినియోగించుకోవాలని ఏఓ ఆంజనేయులు కోరారు. ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓఆర్డీ కమళాబాయ్, డీటీ మహబూబ్‌బాషా, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆఫీసు వద్దే ధర్నా చౌక్ ఏర్పాటు చేయాలి

గుంతకల్లుటౌన్: రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి మున్సిపల్ ఆఫీసు ఎదుటే ధర్నాచౌక్ ఏర్పాటు చేయాలని వామపక్ష నాయకులు కోరారు. బుధవారం మున్సిపల్ ఆఫీసు ఎదుట సీపీఎం, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం చైర్‌పర్సన్ భవాని, కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రాలు అందజేశారు. నాయకులు బి.శ్రీనివాసులు, జి.చిన్నా, మారుతి, దాసరిశ్రీనివాసులు, రమేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులను అందిస్తున్న ఐఎఫ్‌సీఓ సంస్థ సభ్యులు

తాడిపత్రి అర్బన్: మైక్రో లెండింగ్‌లో భాగంగా బుధవారం ఐఎఫ్‌సీఓ ఆధ్వర్యంలో ఆ సంస్థ సభ్యులు పట్టణంలోని టైలర్స్‌కాలనీ, భగత్ సింగ్ నగర్‌లో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఐఎఫ్‌సీఓ రాయలసీమ రీజనల్ మేనేజర్ హుసేన్ వలి మాట్లాడుతూ తమ సంస్థ రాష్ట్రంలో రైతులు, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఎన్నో సహాయక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వివిధ రకాల వస్తూత్పత్తి శిక్షణ, చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు సహకారం అందిస్తామన్నారు. సంస్థ ప్రాజెక్టు మేనేజర్ వన్నూర్‌స్వామి, అడ్మిన్ మేనేజర్ శ్యామ్, డీపీఆర్‌ఓలు సుంకన్న, జయన్న, డివిజనల్ మేనేజర్ గోపి, వైకేపీ సీసీ సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో నమోదు చేయించండి



మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరాముడు

గుత్తి: పత్తి, కంది, జొన్న రైతులు తమ పంటల వివరాలను ఆర్‌బీకేల్లో నమోదు చేసుకునేలా చూడాలని ఏఓలు, ఏఈఓలను ఏడీఏ వెంకటరాముడు ఆదేశించారు. పట్టణంలోని ఏడీఏ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కంది పంట క్వింటాల్ రూ.9,370, జొన్న రూ.3,225, హైబ్రిడ్ జొన్న రూ.3,180, పత్తి రూ.7,020 చొప్పున ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. రైతులు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేయించాక మార్కెట్ యార్డుకు వెళ్లి సీసీఐ అధికారులను కలిసి ఉత్పత్తులు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆలయాల అభివృద్ధికి చర్యలు



పామిడిలో విమాన గోపుర నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



సీసీరోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

- ఎమ్మెల్యే వైవీఆర్
- రూ.1.40 కోట్లతో ఆలయ గోపుర నిర్మాణానికి శంకుస్థాపన

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రాచీన శైవ క్షేత్రమైన భోగేశ్వరాలయంలో ఆలయ గర్భగుడి విమాన గోపుర, పునర్నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, దేవదాయశాఖ ప్రభుత్వ సలహాదారు శ్రీకాంత్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం సీజీఎఫ్ కింద రూ.కోటితో పాటు భక్తుల విరాళం రూ.40 లక్షలతో కలిపి మొత్తం రూ.1.40 కోట్లతో ఆలయ గాలి గోపురం పునర్నిర్మాణ పనులు చేపట్టామన్నారు. తమ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాగానే ఈ ఆలయాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన భోగేశ్వరుని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయించారు. ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, రూరల్ కన్వీనర్ కే నారాయణరెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, బీ ఆసిఫ్, ఓసీ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు కుమ్మెత లక్ష్మి, అడ్వకేట్ దత్తు, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, నాయకులు రాజశేఖర్‌రావు, సునీల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఎస్ మురళీధర్‌గుప్తా, నారాయణమూర్తి, వెంకట్రాముడు, డీవీ మనోజ్‌కుమార్, ఏఈ కృష్ణయ్య, అన్వర్‌బాషా, అబ్దుల్ రజాక్, వెంకటసాయి గుప్తా, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, చుక్కలూరు రామకృష్ణారెడ్డి, పార్వతీశ్వర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రామ్‌నాథ్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ప్రసాద్, శీనా, రాజు పాల్గొన్నారు.

రోడ్లు అభివృద్ధికి చిహ్నాలు

రోడ్లు అభివృద్ధికి చిహ్నాలని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో పీఆర్‌ఆర్ ప్లెయిన్ కింద రూ.5 కోట్లతో నిర్మించ దలచిన హై ఇంఫ్యాక్ట్ రోడ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.5 కోట్లతో ఎన్నడూ లేనివిధంగా సీసీ రోడ్లు నిర్మించి పామిడి రూపురేఖలు మార్చామన్నారు. ఆర్‌అండ్‌బీ కింద రూ.3.15 కోట్లతో దెబ్బతిన్న పెన్నా కాజ్‌వై పై రోడ్డు వేసి ప్రజల రాకపోకలకు మార్గం సుగమం చేశామన్నారు. త్వరలో బీసీసీ రోడ్డుకు ఇరువైపులా విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, పీఆర్ డీఈ మురళీధర్, ఈఓఆర్డీ బీవీ శశికళ, ఏఈ హేమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్.భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మురికివాడలు, శివారు కాలనీల అభివృద్ధిలో భాగంగా 15వ ఆర్థికసంఘం, జీజీఎంపీ, సీఎండీఎఫ్, సాధారణ నిధులతో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, పైప్‌లైన్‌ల ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు విద్యారాణి, షరీఫ్, కృపాకర్ మాట్లాడుతూ తమ వార్డుల్లో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో గుర్తించిన పనులను వెంటనే పూర్తి చేయించాలని కోరారు. కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.7 కోట్లు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు గుర్తించిన 134 పనుల్లో 67 పనులు పూర్తి చేయించామన్నారు. మిగిలినవి కూడా త్వరలోనే చేయిస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్ చాంద్‌బాషా మాట్లాడుతూ పట్టణంలో కుక్కలబెడద నుంచి ప్రజలను కాపాడాలని కోరారు. కౌన్సిల్ సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. 33వ వార్డు పరిధిలోని ఆలూరురోడ్, కటికవీధిలో పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని, కలుషిత నీరు సరఫరా కాకుండా చూడాలని కౌన్సిలర్ విద్యారాణి కోరారు. వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి,మైమూన్, అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన కౌన్సిల్

పట్టణ ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తూ ధర్మవరం రైల్వేగేట్ వద్ద ఆర్‌యూబీని మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిదని కౌన్సిలర్ జేసీబీ.చాంద్‌బాషా పేర్కొన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిల్ సభ్యులంతా కరతాళ ధ్వనులతో కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా మున్సిపల్ ఆఫీసు ఎదుట నిరసన కార్యక్రమాలను నిషేధిస్తూ కౌన్సిల్ తీర్మానం చేసింది. ప్రత్యామ్నాయంగా 60 అడుగుల రోడ్డులో ధర్నాచౌక్‌ను ఏర్పాటు చేస్తామని కమిషనర్ చెప్పారు.

భూసేకరణకు అదనంగా రూ.60 లక్షల కేటాయింపు

ధర్మవరం లెవెల్‌క్రాసింగ్ రైల్వేగేట్ వద్ద సీ–టైప్‌లో ఆర్‌యూబీ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సేకరించి యజమానులకు పరిహారం చెల్లించేందుకు అదనంగా రూ.60 లక్షల మున్సిపల్ సాధారణ నిధుల కేటాయింపునకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఆర్‌యూబీ నిర్మాణానికి రైల్వే రూ.8.50 కోట్లతో టెండర్లు పిలిచిందని, అందులో భూసేకరణ తదితర వాటి కోసం రూ.1.80 కోట్లు కేటాయించిందన్నారు. అయితే ఈ డబ్బు సరిపోకపోవడంతో రూ.60 లక్షలు మున్సిపాల్టీ నుంచి కేటాయిస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టండి



సాయిప్రతాప్‌రెడ్డికి సమస్యను వివరిస్తున్న మహిళ

తాడిపత్రి అర్బన్: అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువ నాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన పట్టణంలోని 32వ వార్డులో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. వార్డుల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వైఎస్.జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. వక్ఫ్‌బోర్డు కార్యదర్శి బాబాఫకృద్దీన్, నాయకులు సూర్యప్రభాకర్‌బాబు, పేరం ఆది, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. ఊరిచింతల గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి, సీనియర్ నేత ఆలూరు రామేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు సురేంద్రరెడ్డి, ఆదిశంకర్‌గౌడ్, ప్రభాకర్, దాదా, జనార్ధన్, శ్రీనివాసులు, చిన్న రామాంజనేయులు, రమేష్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలి



గార్లదిన్నె : మాట్లాడుతున్న ఎంపీపీ వెంకట నారాయణ

గార్లదిన్నె: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ వెంకటనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదటగా ప్రభుత్వశాఖల వారిగా అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కల్లూరు పాఠశాలలో ప్రహరీ నిర్మించాలని కోఆప్షన్ సభ్యుడు బాబా యూనీస్ కోరారు. మండలానికి రెగ్యులర్ ట్రాన్స్‌కో ఏఈని నియమించాలని పలువురు ఎంపీటీసీలు కోరారు. తహసీల్దార్ ఉషారాణి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇంటి పట్టా మంజూరై ఇళ్లు నిర్మించుకున్న వారందరికీ ప్రభుత్వం ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుందన్నారు. నిబంధనలకు లోబడి ఉన్న అసైన్డ్ భూములను కూడా ప్రభుత్వం రిజిస్ట్రేషన్ భూములుగా మార్పు చేస్తుందన్నారు.. ఎంపీడీఓ విజయభాస్కర్, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, ఎంఈఓ చంద్రనాయక్, పశు వైద్యాధికారి రమేష్, ఏఓ సోమశేఖర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం గంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఎంపీపీ సరస్వతి అధ్యక్షతన సమావేశం జరిగింది. జెడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ హాజరయ్యారు. ఈసందర్భంగా అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినింపించారు.

పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే ఆస్తి చదువే



పుట్లూరులో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న భూమిరెడ్డి సునీతమ్మ

పుట్లూరు: పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే తరగని ఆస్తి చదువేనని శింగనమల మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీతమ్మ అన్నారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అందులో విద్య రంగానికి సంబందించి నాడు–నేడు పథకం కింద పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో పాటు అనేక కార్యక్రమాలను చేపట్టారన్నారు. అనంతరం పాఠశాలలో 62 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందించారు. భూమిరెడ్డి ట్రస్ట్ చైర్మన్, ఎంపీటీసీ భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, ఎంఈఓ ప్రేమ్‌కుమార్ హెచ్‌ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంకాలమ్మ, కుంటెమ్మ జాతర



రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

పామిడి: స్థానిక కొండూరు రోడ్డులో వెలసిన అంకాలమ్మ, కుంటెమ్మ ఆలయాల్లో అమ్మవార్ల 16వ జాతర బుధవారం ముగిసింది. ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేయించారు. అనంతరం న్యూ కేటగిరీ విభాగంలో రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభించారు. మొదటి బహుమతి మొత్తం రూ.50 వేలను తన వంతుగా ఎమ్మెల్యే ఆలయ పూజారి నాగరాజుకు అందజేశారు. నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్ కొత్తూరుకు చెందిన రైతు బీ సుబ్రమణేశ్వరరెడ్డి వృషభరాజులు మొదటి, బీరం సుబ్రమణేశ్వర్‌రెడ్డి వృషభాలు ద్వితీయ, యల్లనూరు మండలం చిలమకురు గ్రామానికి చెందిన పుట్లూరు సుదర్శన్ వృషభరాజులు తృతీయ, నా కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పుచ్చకాయలమడకు చెందిన జెల్లి ధనుంజయ్ వృషభరాజులు నాలుగో, తాడిపత్రి మండలం కోమలికి చెందిన జీ నాగేశ్వర్‌రెడ్డి వృషభరాజులు ఐదో స్థానంలో నిలిచాయి. వృషభాల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.35 వేలు, రూ.25 వేలు, రూ.15వేలు, రూ.10 వేల చొప్పున నగదు అందజేశారు. ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు జెర్సీల అందజేత

గుంతకల్లు: లోకోపైలెట్ ఎం.ఎలీషా, మారథాన్ జ్ఞాపకార్థం ఫుట్‌బాల్ క్రీడాకారులకు జెర్సీలను అందజేశారు. బుధవారం మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో వారి కుమారులు ప్రవీణ్, ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ చేతులు మీదుగా పంపిణీ చేశారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 27న ఎమ్మిగనూరులో జరిగే సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నీలో విజయం కేతనం ఎగరవేయాలని ఆకాంక్షించారు. నాయకులు శ్రీనివాసశర్మ, మస్తాన్‌వలి, నజీర్, రాజశేఖర్, రాజు ఉన్నారు.

సమయపాలన పాటించాలి

యాడికి: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఈఓఆర్డీ వెంకటేశ్వర్లు సూచించారు. నగరూరు సచివాలయ కార్యదర్శి వసుందర విధులకు హాజరు కాకుండా తూట్రాళ్లపల్లె పంచాయతీ రికార్డులు సక్రమంగా నిర్వహించటం లేదని తాడిపత్రికి చెందిన లత డీపీఓకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఈఓఆర్డీ నగరూరు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

జోరుగా నియోజకవర్గస్థాయి 'ఆడుదాం ఆంధ్రా'



వాలీబాల్‌లో గెలిచిన నార్పల జట్టు

శింగనమల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలు జోరుగా జరిగాయి. ఖోఖోలో బుక్కరాయసముద్రం జట్టు, బ్యాడ్మింటన్‌లో గార్లదిన్నె జట్టు, కబడ్డీ, వాలీబాల్‌లో నార్పల జట్టు విజయం సాధించాయి. నియోజకవర్గ స్థాయిలో విజయం సాధించిన జట్టు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఎంపీడీఓ నిర్మలాకుమారి తెలిపారు. నియోజకవర్గంలోని పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు. గురువారం మహిళలకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

యల్లనూరు: మేడికుర్తి గ్రామంలో మద్యం అమ్ముతున్న ఇద్దరిని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. నిందితుల నుంచి 22 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం



శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ

గుత్తి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని వక్తలు పేర్కొన్నారు. గుత్తి ఆర్ఎస్‌లోని 6వ వార్డు సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిందే వరలక్ష్మి ప్రారంభించారు. వైద్యులు ఎల్లప్ప, వెంకట రమణారెడ్డి రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య,కౌన్సిలర్లు రాజేశ్వరి, వెంకటసుబ్బయ్య, ఫరూక్, ఖాజా ఖాన్, వాల్మీకి శివ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గురుప్రసాద్‌యాదవ్, పట్టణ కన్వీనర్ పీరా, ఉపాధ్యక్షులు వాల్మీకి శివ ప్రసాద్, షఫి పాల్గొన్నారు.

'జనసేనలో చేరింది ఆ పార్టీ వారే'

గుత్తి రూరల్: బసినేపల్లి తండా గ్రామంలో ఇటీవల జనసేనలో చేరింది ఆ పార్టీకి చెందిన వారేనని, ఇతర పార్టీల వారు చేరలేదని వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ లాలు నాయక్, నాయకులు పేర్కొన్నారు. బుధవారం బసినేపల్లి తండాలో వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో రెండు కుటుంబాలు చేరితే 20 కుటుంబాలు చేరినట్లు జనసేన నాయకులు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం పార్టీలో చేరిన వారు ముందు నుంచి జనసేనలోనే ఉన్నారని, గతంలో సర్పంచ్ ఎన్నికల్లో జనసేన మద్దతుతో పోటీ చేసి ఓటమి పాలయ్యారన్నారు. అదే పార్టీలో ఉండి తిరిగి పార్టీలో చేరినట్లు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వార్డు సభ్యులు మోతీలాల్‌నాయక్, బాలచంద్రనాయక్, నాయకులు వలినాయక్, జగన్నాయక్, రామునాయక్, కృష్ణనాయక్, ఫకీరా నాయక్, పద్మానాయక్, గోవిందునాయక్ పాల్గొన్నారు.

గుత్తి సెబ్ ఎస్‌ఐగా సునీల్‌కుమార్



గుత్తి: గుత్తి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐగా తలారి సునీల్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పని చేస్తున్న అలీ సత్యసాయి జిల్లా కదిరికి బదిలీ అయ్యారు. కోడుమూరులో సెబ్ ఎస్‌ఐగా పని చేస్తున్న తలారి సునీల్‌కుమార్ఇక్కడికి వచ్చారు. కొత్త ఎస్‌ఐకు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

నేటి నుంచి పశుసంవర్ధక వారోత్సవాలు

బుక్కరాయసముద్రం: స్థానిక పశువైద్యశాలలో గురువారం నుంచి పశు సంవర్ధక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆశాఖ ఏడీ డాక్టర్ రత్న కుమార్ బుధవారం తెలిపారు. కార్యక్రమంలో భాగం పెంపుడు జంతువులకు యాంటీ రేబీస్ టీకాలు వేస్తామన్నారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యం



బోయరెడ్డిపల్లెలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి: ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ద్వారా ప్రజల చెంతే మెరుగైన వైద్యం అందిస్తోందని యాడికి పీహెచ్‌సీ వైద్యాధికారి పరమేశ్వర్ తెలిపారు. బుధవారం బోయరెడ్డిపల్లెలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో 60 మందికి వైద్యాధికారి పరమేశ్వర్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ నందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

నియోజకవర్గస్థాయి పోటీలకు గజరాంపల్లి జట్టు

పామిడి: ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీల్లో గజరాంపల్లి జట్టు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో బుధవారం జట్టుకు ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ ముధుసూదన్‌రెడ్డి క్రికెట్ కిట్ అందజేశారు. ఈనెల 29న గుంతకల్లు రైల్వే స్టేడియంలో నిర్వహించే నియోజకవర్గస్థాయి పోటీల్లో మండలం నుంచి గజరాంపల్లి జట్టు పాల్గొంటుందని ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ హేమ్లానాయక్, పంచాయతీ కార్యదర్శి షామీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దురదపై భయాందోళన వద్దు



ఆస్పత్రికి వచ్చిన విద్యార్థులు

యాడికి: దురదపై భయాందోళన వద్దని యాడికి పీహెచ్‌సీ వైద్యాధికారి పరమేశ్వర్ అన్నారు. కమలపాడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు దురదతో బాధపడుతున్నట్లు సమాచారం అందుకున్న పరమేశ్వర్ పాఠశాలను సందర్శించి విద్యార్థులను ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. వైద్యులు పరమేశ్వర్, శ్రీరాంకుమార్ పీహెచ్‌సీలో చిన్నారులకు వైద్యం చేశారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.

బాలికలు ఉన్నత స్థాయికి ఎదగాలి



గుత్తి రూరల్: మాట్లాడుతున్న బాలల పరిరక్షణ అధికారిణి వెంకటేశ్వరి



అతిథులను సన్మానిస్తున్న ఎస్‌ఆర్ఐటీ యాజమాన్యం

గుత్తి రూరల్: బాలికలు బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారిణి వెంకటేశ్వరి అన్నారు. బుధవారం రజాపురంలోని డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో గురుకుల పాఠశాలలో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం బాలల పరిరక్షణ అధికారిణి వెంకటేశ్వరి మాట్లాడుతూ బాలికలు లక్ష్యం ఏర్పరుచుకొని దాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. బాలికల హక్కులు, వారి కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం బాలల హక్కులను అందరూ కాపాడుదాం అని ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ ఉషారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రియాంక, బాలల పరిరక్షణ సమితి సభ్యురాలు రమాదేవి పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: ఆడపిల్లల పట్ల వివక్ష చూపొద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీదా తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం ఎస్ వెంకటాంపల్లిలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

గుత్తి: స్థానిక ఆర్ఎస్‌లో జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం సీడీపీఓ ఢిల్లీశ్వరి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాలికలు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

బుక్కరాయసముద్రం: బాలికల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జేఎన్‌టీయూ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ చిత్ర పేర్కొన్నారు. బుధవారం రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ చిత్ర మాట్లాడుతూ బాలికలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. విజయనగర్ లా కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వాసవీలత బాలికలు స్వీయరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దిశా, నారీ శక్తి, వరకట్న చట్టంపై అవగాహన కల్పించారు. టోస్ట్ మాస్టర్ వహిదా పర్వీన్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ వినతారెడ్డి, నోలిక్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ లక్ష్మి, ఎస్సీ, ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ వెంకట సునీల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.